క్లుప్తంగా

వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా సాయిరాం



పామర్రు: పామర్రు గ్రామంలోని వాసవీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఘంటసాల త్రివిక్రమ సాయిరాంను ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. వివరాలను చిన్నం ఆదినారాయణమూర్తి తెలిపారు. స్థానిక జాలయ్య, సుబ్బరత్తమ్మ ఆర్య వైశ్య కల్యాణ మండపంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రస్తుత అధ్యక్షుడి పదవీ కాలం ఈనెల 31న ముగియనున్నందున నూతన అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఘంటసాల త్రివిక్రమ సాయిరాం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ఎంపికైన సాయిరాంను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. క్లబ్ సభ్యులు బొగ్గరపు సాయిబాబు, ఘంటసాల భరతుడు, పుల్లారావు, వీర జనార్ధనరావు, మండా కమలాకరనాథ్, పరిశా వెంకట నాంచారయ్య, తాళ్లూరి నరేష్, శ్రీనివాసరావు, రామారావు, శివయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి



గుడివాడ టౌన్: భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ నాయకుడు వాజ్‌పేయి అన్నారు. రాజకీయాలు పారదర్శకంగా ఉండాలనే సంకల్పంతో తన పదవిని తృణప్రాయంగా వదిలేసిన నాయకుడు వాజ్‌పేయి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామినేని వెంకట కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి సూరే గాంధి, వలపర్ల వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, పట్టణ అధ్యక్షుడు ఎర్రబోతు అర్జున్, డి.సురేంద్ర, మురళి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న షష్ఠి ఉత్సవాలు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ షష్ఠి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో భక్తుల రద్దీ క్రమేణా పెరుగుతోంది. ఈనెల 17న ప్రారంభమైన ఈ ఉత్సవాలు 29న జరిగే అన్నసమారాధనతో ముగుస్తాయి. రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో వీటిని తిలకించేందుకు భక్తులు తరలివస్తున్నారు. స్వామివారి పుట్టలో పాలు పోసేందుకు, దర్శించుకునేందుకు వచ్చే భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడుతోంది. శుక్రవారం జరిగే అన్నసమారాధనకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ అన్నసమారాధనకు వివిధ ప్రాంతాల నుంచి 50 వేల మందికి పైగా భక్తులు తరలి వస్తారని ఆలయ అధికారులు అంచనా.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



మచిలీపట్నంటౌన్: పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 డైరీ, క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విట్టంశెట్టి వెంకు మాస్టారు, సంఘ నాయకులు సత్యనారాయణ, ఉచిత పరిణయ వేదిక కన్వీనర్ నీలం ప్రసాద్, దివి సాయి, జిల్లా అధ్యక్షుడు ఎస్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: పెనమలూరు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అవడంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి మేదర్‌బజార్‌కు చెందిన ఇంటూరి మురళీకృష్ణ, అతని మిత్రుడు నాగబాబు బైక్‌పై పెనమలూరు వెళ్తుండగా పెనమలూరు సెంటర్‌లో వెనుక నుంచి వచ్చిన లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరూ కిందపడిపోవడంతో గాయాలయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

లోకశాంతి కోసమే క్రీస్తు జననం



దానిగూడెంలో క్రిస్మస్ వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో క్రిస్మస్ పండగ వేడుకలు సోమవారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. కైకలూరులో క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే డీఎన్నార్ పాల్గొన్నారు. లోకశాంతి కోసమే క్రీస్తు జన్మించారని, ఆయన బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే డీఎన్నార్ అన్నారు. కైకలూరులో ఆర్‌సీఎం, మన్నా, బీపీఎఫ్, ఆటపాక సీబీసీఎన్‌సీ తదితర చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆర్‌సీఎం చర్చిలో రెవ.ఫాదర్ ప్రవీణ్ ఏసు ప్రేమ సందేశాన్ని వినిపించారు. బాల ఏసు బొమ్మల కొలువు ఆకట్టుకుంది. ఎమ్మెల్యే డీఎన్నార్ కైకలూరు మన్నా చర్చి, దానిగూడెంలో గలిలియా, క్రీస్తు మహిమా చర్చి, బైబిల్ చర్చిల్లో జరిగిన ప్రార్థనలకు ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, ఎంపీటీసీ సాదు కొండయ్య, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ నాయకులు గోట్రూ పాట్రిక్ పాల్, మండల కో ఆప్షన్ సభ్యులు సోమల శ్యాంసుందర్, మహమ్మద్ గాలిబ్ బాబు, దానం ప్రసాద్, పాస్టర్లు జాషువా జ్యోతి, పాస్టర్ మంగినేని శ్యామ్‌బాబు, తోట మాధవ్, అర్జా సురేష్‌బాబు, బత్తుల వాసు, వివేష్ వర్మ, బత్తుల మధు, ఉంద్రమట్ల ఏసు, బిరుదుగడ్డ క్రీస్తురాజు, బిరుదుగడ్డ లాజరు, తాండ్రు నాంచారయ్య, పయ్యద్దు శ్రీనివాస్, ఇంటి రమేష్, ఇంటి ఏసుపాదం, ఇంటి రాజా, మద్దా రాముడు,



కైకలూరు ఆర్‌సీఎం చర్చిలో ఆకట్టుకున్న బాల ఏసు బొమ్మల కొలువు

ఇంటి యుగంధర్, సదర్ల నాగరాజు, బిరుదుగడ్డ సిమోను, ఇంటి ఇశ్రాయిల్, జల్లి సతీష్ పాల్గొన్నారు. పూజా అపార్టుమెంట్‌లో క్రిస్మస్ వేడుక ఏపీ సీడబ్ల్యూవో రావి రవిప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. హిందూ, ముస్లిం, క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ జేజే రాజు ప్రభు ఏసు సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె.రత్నారెడ్డి, ఎస్.శ్రీనివాసరాజు, కొల్లి రాధాకృష్ణ, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: క్రిస్మస్ పండగ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు సోమవారం వేకువజామునే పవిత్ర స్నానాలను ఆచరించి, నూతన వస్త్రాలను ధరించి క్యాండిల్ ర్యాలీతో చర్చిలకు తరలివెళ్లారు. క్రీస్తు గీతాలను ఆలాపించటంతోపాటు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తోట్లవల్లూరు మరనాత చర్చిలో పాస్టర్ వల్లూరు



తోట్లవల్లూరులో దైవసందేశం వినిపిస్తున్న పాస్టర్ చంద్రశేఖర్

చంద్రశేఖర్ ప్రత్యేక ప్రార్థనలు జరిపి, దైవ సందేశం వినిపించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. ఆర్‌బీకే చైర్మన్ గోనేపల్లి శ్రీనివాసరావు, శేషగిరిరావు, నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: మండలంలో సోమవారం క్రిస్మస్ శోభతో చర్చిలు కళకళలాడాయి. మండవల్లి, కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, భైరవపట్నం, అయ్యవారిరుద్రవరం, అప్పాపురం, భైరవపట్న, లోకుమూడి తదితత గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి. మండవల్లిలోని హోలీ ఆర్మీ ఫెలోషిప్ చర్చిలో నిర్వాహకురాలు రాణీ అబ్రహాం



మండవల్లి ఆర్సీఎం చర్చిలో మాట్లాడుతున్న ఫాదర్ కిషోర్

క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. అనంతరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పలువురు పాస్టర్లు, ముద్రబోయిన వెంకటేశ్వరరావు, సుబ్బారావు సంఘస్తులు, దైవజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండవల్లి ఆర్సీఎం చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. రెవ.ఫాదర్ నూతలపాటి కిషోర్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు. కేక్ కట్ చేశారు. సర్పంచ్ మెండా ఝాన్సీ దంపతులు, మెండా సురేష్, ఏసుదాసు, నెహ్రూ, సంఘస్తులు పాల్గొన్నారు.



ముదినేపల్లి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

మార్గదర్శకుడు ఏసుక్రీస్తు

జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక


గుడ్లవల్లేరు: ప్రేమ, కరుణ, శాంతి తత్వానికి ఏసు క్రీస్తు మార్గదర్శకుడని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని సోమవారం మామిడికోళ్ల చర్చిలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర మాజీ కన్వీనర్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది చిత్తర్వు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. తొలుత స్థానిక చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఏసు విశ్వాసులకు క్రిస్మస్ ట్రీట్‌ను ఇచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి ఉప్పాల రాము, ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, మండల పార్టీ అధ్యక్షుడు శాయన రవి, ఎంపీపీ కొడాలి సురేష్, పార్టీ నాయకులు కోట ప్రోలు నాగు, కనుమూరి రామిరెడ్డి, అల్లూరి రాము, కమల,బద్రెడ్డి బద్రీనాథ్, నిరీక్షణరావు తదితరులు పాల్గొన్నారు.



మామిడికోళ్ల చర్చిలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల, చిత్తర్వు

ఫెయిత్ వర్షిప్ మినిస్ట్రీస్ చర్చిలో..

విశ్వాసులకు తన రాజ్యంలో స్థానం కల్పించేందుకు ఏసుక్రీస్తు తప్పక రానున్నారని ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు రెవరెండ్ లింగం జాన్‌బెన్నీ అన్నారు. కూరాడ ది ఫెయిత్ వర్షిప్ మినిస్ట్రీస్ చర్చిలో ప్రార్థనలు చేశారు. నెహ్రూనగర్‌లోని పెనియేలు మందిరంలో ప్రార్థనలు నిర్వహించారు. బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి.



గుడివాడ కోతిబొమ్మ సెంటర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో ప్రసంగిస్తున్న ఫాదర్లు



గుడివాడ రైల్వే స్టేషన్ వద్ద సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలో భక్తులు

పెదపారుపూడి: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పెదపారుపూడి సీఎస్ఐ, ఆర్‌సీఎం, రక్షణ సైన్యం చర్చిలో ప్రత్యేక ప్రార్థనాలు నిర్వహించారు. క్రీస్తు సందేశాన్ని వివరించారు. మండలంలోని వానపాముల పెంతుకోస్తు చర్చిలో క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక పార్థనలు చేశారు. యలమర్రు, వెంట్రప్రగడ పలు చర్చిలో ప్రార్థనలు చేశారు.

ఆనందోత్సాహాలతో క్రిస్మస్

గుడివాడ టౌన్: ఏసుక్రీస్తు జన్మదినం క్రిస్మస్ పర్వదినాన్ని పట్టణ క్రైస్తవులు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పట్టణంలోని అన్ని చర్చిలలో వారి సంప్రదాయాలకు అనుగుణంగా సోమవారం ప్రార్థనలు నిర్వహించారు. పలువురు సువార్తికులు ముఖ్య ప్రసంగీకులుగా పాల్గొని క్రీస్తు జనన సందేశాన్ని భక్తులకు తెలియజేశారు. క్రైస్తవులు పరస్పరం అభినందనలు తెలుపుకుంటూ పర్వదినాన్ని సంతోషంగా గడుపుకున్నారు.

ముదినేపల్లి రూరల్‌లో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పలు ప్రార్థనా మందిరాలు తెల్లవారుజాము నుంచే ఏసుక్రీస్తు బోధనలు, విశ్వాసుల ప్రార్థనలతో హోరెత్తాయి. వణుదుర్రు, ముదినేపల్లి చర్చిల్లో క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. ముదినేపల్లి చర్చి పాస్టర్ మణికుమార్ విశ్వాసులతో కలిసి ప్రార్థనలు చేశారు. శ్రీహరిపురం బీసీ కాలనీ ఇమ్మానియేల్ చర్చిలో పాస్టర్ ఏసుదాసు ఆధ్వర్యాన క్రిస్మస్ కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కొరగంటపాలెం ఇమ్మానియేల్ చర్చిలో పాస్టర్లు ఉచ్చుల విజయ్‌కుమార్, స్పర్జన్ రాజు, సింగరాయపాలెం ప్రేమస్వరూపిణి ప్రార్థనా మందిరంలో బండి డేవిడ్ రాజు, కొత్తపల్లి న్యూజెరూసలేం ప్రార్థనా మందిరంలో పాస్టర్ పి.పీటర్, పెయ్యేరు షాలేం ప్రార్థనా మందిరంలో పాస్టర్ మోట్రు ఏసురత్నం ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య క్రైస్తవులు జరుపుకున్నారు.

ఏసు క్రీస్తు జన్మదినం మానవాళికి శుభోదయం

పెదమద్దాలి(పామర్రు): క్రీస్తు జన్మదినం మానవాళికి శుభోదయమని పాస్టర్ సమ్మంగి కృష్ణపాల్ అన్నారు. మండలంలోని పెదమద్దాలి గ్రామంలో సెయింట్ పాల్ చర్చిలో క్రిస్మస్ పండుగ సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభువైన ఏసు క్రీస్తు శాంతికి చిహ్నం అన్నారు.క్రీస్తు మర్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పేర్కొన్నారు. కేకును కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యరూతు, కాకే ప్రసాద్, పట్టెం నాంచారయ్య, దోమతోటి గ్రేసమ్మ, పోలే శ్రీదేవి, కంచర్ల షారోను సంఘస్తులు పాల్గొన్నారు. పామర్రు చాట్లవానిపురంలోని గాస్పెల్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల మాట్లాడుతూ ఇతరులకు మేలు చేయడమే క్రిస్మస్ అని అన్నారు. సీహెచ్ ఏసుపాదం,



పెదమద్దాలిలో మాట్లాడుతున్న పాస్టర్ సమ్మంగి కృష్ణపాల్

సీహెచ్ కృష్ణ, సుబ్రమణ్యాం, కె.బుజ్జి, ప్రభుదాసు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అక్షింతల కలశాల ఊరేగింపు


పామర్రు: జై శ్రీరామ్ నినాదంతో పామర్రు గ్రామం సోమవారం మార్మోగింది. అయోధ్య శ్రీరాముల వారి దేవాలయం భారత దేశ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని విశ్వ హిందు పరిషత్ పామర్రు మండల అధ్యక్షుడు అరిగెల బాలుడు పేర్కొన్నారు. మండల పరిధిలోని ప్రతి గ్రామానికి అక్షింతల కలశాలను రామ నామ సంకీర్తనలతో పంపిస్తామని తెలిపారు. జనవరి 22వ తేదీలోపుగా ప్రతి ఇంటికీ ఈ స్వామివారి అక్షింతలు పంపిస్తామన్నారు. అక్షింతల కలశాలను గ్రామంలోని వెలమపేట, అరండాల్ పేటలలోని రామాలయాల్లో, శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో పూజాధికాలను చేయించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు పీఎంఎస్ ప్రసాద్, పీ లక్ష్మణరావు, ఆళ్లరామిరెడ్డి, బసవ శంకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, జేజిబాబు, సంకభవాని, సందపు పాండు, పీవీ నారాయణ, ఐవీఎస్ మనోహరరావు, వాసవీ క్లబ్ ప్రతినిధులు ఘంటసాల త్రివిక్రమ సాయిరాం, చిన్నం ఆదినారాయణ, బొగ్గరపు జాలయ్య, మానేపల్లి రఘురామ్, ఊటుకూరి పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు.



పామర్రులో రాములవారి అక్షింతల కలశాలను ఊరేగిస్తున్న భక్తులు

షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేత

గుడివాడ టౌన్: స్థానిక ఏజీకే హైస్కూల్‌లో జరిగిన టీచర్స్ ప్రీమియర్ లీగ్ సీజన్-4 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈనెల 11వ తేదీ ప్రారంభమైన ఈ పోటీల్లో మొత్తం 9 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ పోటీల్లో విజేతలుగా కోటి నాగేశ్వరరావు, డి. చంద్రశేఖర్‌ల జట్టు వరుసగా 17-15, 17-14 పాయింట్లతో బీ శ్రీనివాసరావు, గుంటూరు ప్రసాదుల జట్టుపై విజయం సాధించింది. విజేతలకు ఖోఖో జాతీయ శిక్షకులు మడకా ప్రసాదు, డెప్యూటీ తహసీల్దార్ జె.సుబ్రహ్మణ్యం, సీనియర్ షటిల్ ప్లేయర్ పూజేశ్వరరావు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు ఎంపైర్‌గా వ్యాయామ ఉపాధ్యాయుడు మృత్యుంజయ వ్యవహరించారు.




సాధించిన పతకాలతో నాగేశ్వరరావు జట్టు

విద్యుత్ తీగల చోరీతో రైతుల బెంబేలు

ఒక్క రోజులో 60 మోటార్లకు ఉన్న విద్యుత్ తీగల చోరీ

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు లంకలో విద్యుత్ తీగల చోరీతో రైతులు బెంబేలెత్తుతున్నారు. అర్ధ రాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తులు రాగి వైరు కోసం విద్యుత్ తీగలు చోరీ చేస్తూ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. సాత్ వల్లూరు రెవెన్యూ పరిధిలోని బీసీ సొసైటీ, పాముల లంక ప్రాంతాల్లో గత గురువారం రాత్రి సుమారు 60 మోటార్లకు సంబంధించిన విద్యుత్ తీగలను దొంగలు అపహరించారు. సబ్ మెర్సిబుల్ బోరు నుంచి విద్యుత్ స్విచ్ బోర్డు మధ్యలో ఉండే విద్యుత్ తీగలను చోరీ చేశారు. కత్తిరించిన విద్యుత్ తీగలను లంకలోనే పలు చోట్ల దగ్ధం చేసి దానిలో రాగి వైరు ఎత్తుకెళ్లినట్లు రైతులు చెబుతున్నారు. గత రెండు నెలల వ్యవధిలో ఇలా జరగటం మూడోసారని అంటున్నారు. పోలీసులు స్పందించి విద్యుత్ తీగల చోరీకి పాల్పడుతున్న ముఠాను గుర్తించి తమను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



తోట్లవల్లూరు లంకలో కత్తిరించిన మోటారు వైరు



విద్యుత్ తీగలను దగ్ధం చేసిన ప్రదేశం

నేడు వీఎం రంగా వర్ధంతి

పామర్రు: స్థానిక శాసన సభ్యుల కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు వంగవీటి రంగా వర్ధంతి నిర్వహిస్తున్నట్టు పామర్రు ఎమ్మెల్యే కార్యాలయ స్పిబంది సోమవారం తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు పామర్రు టౌన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అందరూ పాల్గొనాలని కోరారు.

మార్మోగిన పెద్దింట్లమ్మ నామస్మరణ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

కైకలూరు: పెద్దింట్లమ్మ నామస్మరణతో కొల్లేటి కోట మార్మోగింది. మాలధారులు ఏర్పాటు చేసిన మహా పడి భజనకు వేలాదిగా కొల్లేరు ప్రాంత ప్రజలు పాల్గొనగా, ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) దంపతులు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. సమీప జిల్లాలలో ఎక్కడా లేని అదిపెద్ద అనివేటి మండపాన్ని అమ్మవారి ప్రాంగణంలో నిర్మిస్తున్నామని, పనులు చివరి దశకు చేరాయని ఎమ్మెల్యే చెప్పారు. ఆలయ ఈవో కేవీ గోపాలరావు ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ పులవర్తి లక్ష్మణ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. విద్యుత్ అలంకరణ ఆకట్టుకుంది. భజన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు శ్యామ్ ఫణికుమార్, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, బలే సముద్రుడు, ఘంటసాల జగన్నాధం, పందిరిపల్లిగూడెం ఉప సర్పంచ్ మేడిశెట్టి మహేష్, జక్కా శివాజీ, ఉంద్రమట్ల సుబ్బారాజు, బలే సారంగధర్, బలే నరసింహారావు, బలే సుజాత, మద్దాని సుబ్బలక్ష్మి, ఇంటి ఇందిరమ్మ, నేపాల మీరకుమారి, సైదు మంగ తాయరమ్మ, పేటేటి ప్రసాద్, సైదు తాతారావు, వెంకటేశ్వరరావు, బోడావుల మల్లి, బలే శరత్ బాబు, బలే గణేష్, ఘంటసాల బాలు, ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా



పోటీలకు సిద్ధమవుతున్న పెనమకూరు జెడ్పీ పాఠశాల క్రీడా ప్రాంగణం

గుడివాడ టౌన్: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలను స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ప్రారంభిస్తారన్నారు. క్రీడాభిమానులు, పట్టణ ప్రజలు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నందివాడ మండలంలో..

నందివాడ మండలంలో మంగళవారం నుంచి జనవరి 9వ తేదీ వరకు మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ వీఎస్ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సచివాలయ పరిధిలో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

పోటీలకు ఏర్పాట్లు సిద్ధం

తోట్లవల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం విజయవంతానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల వ్యాప్తంగా 13 గ్రామ సచివాలయాల పరిధిలో పోటీలు జరగనున్నాయి. దీని కోసం వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, పెనమకూరు జెడ్పీ పాఠశాలల క్రీడా మైదానాలను అధికారులు శుభ్రం చేయించి ఆటలకు సిద్ధం చేస్తున్నారు. తొలుత గ్రామ స్థాయిలో, తరువాత మండల స్థాయి, అనంతరం నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు జరగనున్నాయి. ఎంపీడీఓ తుంగల స్వర్ణలత పర్యవేక్షణలో పోటీలకు చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి.

పోటీలను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

పెదపారుపూడి: మండలంలోని యలమర్రు హైస్కూల్ ఆట స్థలంలో ఆడుదాం ఆంధ్ర పోటీలో భాగంగా మంగళవారం కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ప్రారంభిస్తారని ఎంపీడీవో టీ సీతామహాలక్ష్మి సోమవారం తెలిపారు. ఎంపీపీ గోగం సురేష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొంటారని పేర్కొన్నారు.

మండవల్లి: మండలంలో మంగళవారం నుంచి 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ టీకే వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భైరవపట్నంలో సాయిబాబా మందిరం వద్ద అన్ని సచివాలయాల క్రికెట్ జట్లు, పెరికెగూడెం, లింగాల సచివాలయాలు లింగాల జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద, లోకుమూడి సచివాలయం ఎదురుగా లోకుమూడి, తక్కెళ్లపాడు, భైరవపట్నం సచివాలయాలు, మండవల్లి హైస్కూల్ నందు అయ్యవారిరుద్రవరం, గన్నవరం, ఇంగిలిపాకలంక, మండవల్లి సచివాలయాలు, భైరవపట్నం ఆర్సీఎం చర్చి రోడ్డులో భైరవపట్నం, తక్కెళ్లపాడు సచివాలయాలు, కొవ్వాడలంక సచివాలయం వద్ద పెనుమాకలంక, కొవ్వాడలంక సచివాలయాలు, చింతపాడు హైస్కూల్ వద్ద చింతపాడు, పులపర్రు సచివాలయాలు, కానుకొల్లు హైస్కూల్‌లో కానుకొల్లు, ఉనికిలి, పుట్లచెరువు సచివాలయాలు పాల్గొంటాయని పేర్కొన్నారు.

వేడుకగా ధ్వజారోహణం

గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రులో భూ సమేత వేంకటేశ్వర స్వామివారి దేవస్థాన వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిల్) మేనేజింగ్ డైరెక్టర్, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ధ్వజారోహణ కార్యక్రమం సోమవారం వేడుకగా వేద పండితులు నిర్వహించారు. స్వామివారు వివిధ వాహనాలపై పుర వీధుల్లో విహరించారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. గ్రామ మాజీ సర్పంచి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి ఊరేగింపు